

కారుణ్య నియామకాలు

డాబాగార్డెన్స్: ఆర్టీసీలో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు.



సిరులతల్లికి తులసీదళార్చన

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	ఆది	సోమ
అనకాపల్లి	6.13	4.43
నర్సీపట్నం	6.15	4.42

న్యూస్‌రీల్

గంజాయి కేసుల్లో నిందితుల ఆస్తుల జప్తు

- ఎస్పీలకు డీఐజీ ఆదేశం



డీఐజీ గోపీనాథ్ జెట్టి వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అనకాపల్లి: గంజాయి రవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, నిందితుల ఆస్తుల జప్తు, డీ–అడిక్షన్ కార్యక్రమాలపై విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి శనివారం ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గంజాయి రవాణాలో లబ్ధిదారులుగా ఉన్న వ్యక్తుల ఆస్తులను గుర్తించి త్వరితగతిన జప్తు చేయాలని ఆదేశించారు. గంజాయి వినియోగదారులను గుర్తించి, వారిని డీ–అడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తున్నామన్నారు. పోక్సో కేసుల్లో బాధితులకు కలెక్టర్ల ద్వారా పరిహారం త్వరగా అందేటట్లు చర్యలు చేపట్టాలన్నారు.

మలేషియాలో చిక్కుకున్న జి.నగరంవాసి



ఒమ్మి భూషణం

మాకవరపాలెం: ఉపాధి కోసం వెళ్లిన ఓ వ్యక్తి మలేషియాలో చిక్కుకున్నాడు. మండలంలోని జి.నగరం గ్రామానికి చెందిన ఒమ్మి భూషణం ఉపాధి నిమిత్తం 2019లో మలేషియా వెళ్లాడు. మూడేళ్లపాటు బాగానే ఉన్నా.. అనంతరం ఇబ్బందులు మొదలయ్యాయి. స్వగ్రామానికి పంపాలని భూషణం ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. ఎనిమిది నెలల క్రితం తన కుమార్తె వివాహానికి వెళ్తానన్నా పంపించలేదని శనివారం వీడియో ద్వారా తెలియజేశాడు. తన పాస్‌పోర్ట్, వీసా తీసుకుని ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తనను స్వగ్రామం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వీడియో ద్వారా కోరాడు.

భగ్గుమన్న వరి గడ్డి



వరి కోత యంత్రం

- పశుగ్రాసం కొరతతో పాడి రైతులు సతమతం
- మూడింతలు పెరిగి ఆకాశాన్నంటిన గడ్డి ధరలు
- పెట్టుబడి సాయం అందకపోవడంతో తగ్గిన వరి సాగు
- కొత యంత్రాల వినియోగంతో వృథా అవుతున్న గడ్డి
- పొరుగు జిల్లాల నుంచి కొనుగోలు చేయాల్సిన దుస్థితి



వరి నూర్పు పనుల్లో నిమగ్నమైన రైతులు

సాక్షి, అనకాపల్లి: పశువులకు మేతగా వాడే వరి గడ్డికి డిమాండ్ ఏర్పడింది. వరి పంట నూర్పుల సమయంలో గడ్డిని కుప్పలుగా వేసి భద్రపర్చుకుని, పాడి రైతులు వేసవిలో పశువులకు మేతగా వినియోగించుకుంటారు. ఈ ఏడాది కొరత ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారు. రైతుకు పెట్టుబడుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందకపోవడంతో వరి సాగు తగ్గుముఖం పట్టింది. దీనికి తోడుగా వరి కోత యంత్రాల వినియోగం పెరగడంతో గడ్డి గణనీయంగా తగ్గింది. దీంతో పొరుగునున్న కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వరిగడ్డి కొనుగోలు చేసి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ బోర్ల సదుపాయం ఉన్న పాడి రైతులు ప్రత్యామ్నాయంగా పచ్చగడ్డి పశుగ్రాసంగా వేస్తారు. వేసవిలో పచ్చగడ్డితోపాటు ఎండు వరి గడ్డి సమపాళ్లలో పశువులకు మేతగా వేస్తారు. కానీ ప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను 9 గంటలకు బదులు 3 లేదా 4 గంటల పాటే ఇవ్వడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వరి గడ్డి కొరత తీర్చేందుకు పచ్చ గడ్డి అందించలేని పరిస్థితి నెలకొంది.

ఎకరా గడ్డికి మూడింతల ధర

జిల్లాలో 2.34 లక్షల కుటుంబాలు పశుపోషణ చేస్తున్నాయి. 1.85 లక్షల ఆవులు, 2.5 లక్షల గేదెల పశు సంపద ఉంది. వీటికి ఏడాదికి సగటున 5 నుంచి 6 లక్షల టన్నుల వరకు వరి గడ్డి అవసరం ఉంటుందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. గతంలో ఎకరా గడ్డి రూ.5 వేలకు కొనగా.. ఇప్పుడు రూ.13 వేల నుంచి రూ.16 వేలు పలుకుతోంది. ముందు గ్రాసం ధర మరింత పెరిగే అవకాశం ఉండటంతో పశుపోషణపై ఆధారపడిన పలు కుటుంబాల వారు ముందస్తుగానే కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇక్కడకు తెచ్చుకుంటున్నారు.

గణనీయంగా తగ్గిన వరి గడ్డి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1.32 లక్షల ఎకరాల్లో, రబీలో 39,564 ఎకరాల్లో వరి సాగు చేశారు. సాధారణంగా ఎకరా వరి పంట కోత కోస్తే ఐదారు టన్నుల గడ్డి వస్తుంది. కోత యంత్రాలు వినియోగిస్తే మూడు టన్నుల గడ్డి కూడా రావడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సగం భూముల్లో వరి కోత యంత్రాల ద్వారా కోతలు జరిగాయి. రెండుసార్లు భారీ వర్షాలు పడి పంట మునిగిపోయింది. దీంతో డిసెంబర్ నెలలో పంట పూర్తయినా కుప్పలుగా వేసి సంక్రాంతి తరువాత నుంచి నూర్పులు చేశారు. వేసవిలో వరి గడ్డి లేకపోవడంతో ప్రతిరోజూ ట్రాక్టర్లలో గడ్డి పొరుగు ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. కొందరు రైతులు నూర్పిడి ఖర్చులు పెట్టుకొని గడ్డిని తీసుకెళ్లాలని షరతు పెడుతున్నారు. ఎకరా పంట నూర్పిడికి రూ.11 వేలు ఖర్చవుతుండగా ఆ మొత్తాన్ని భరించేందుకు కూడా కొందరు ముందుకు వస్తున్నారు.

> **ఎకరా గడ్డి ఇంటికి చేరేందుకు రూ.16 వేల ఖర్చు**
>
> ఆక్సాహేబుపేట గ్రామంలో సగం పల్లం.. సగం మెట్ట భూములున్నాయి. తాండవ రిజర్వాయర్ ద్వారా కొంతమేర వరి పంట పండిస్తారు. మెట్ట ప్రాంతాల్లో జీడి మామిడి సాగు చేస్తాం. ఈ ఏడాది తాండవ రిజర్వాయర్ నుంచి నీరు ఎక్కువగా రాకపోవడంతో వరి సాగు తగ్గింది. దీంతో గడ్డి కొరత ఏర్పడింది. కాకినాడ జిల్లా చేబ్రోలులో వరి గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తెచ్చుకుంటున్నాం. ఎకరా వరి పంట నూర్పుకు అయ్యే ఖర్చు అక్కడ రైతుకు ఇస్తే మనకు ఎండు వరి గడ్డి ఇస్తారు. సుమారు 50 కి.మీ. దూరం నుంచి తీసుకొని వస్తున్నాం. ఎకరా గడ్డి మా గ్రామానికి తీసుకొచ్చేందుకు రూ.16 వేలు అవుతోంది.
>
> – అల్లు చిట్టిబాబు, రైతు, ఆక్సాహేబుపేట గ్రామం, కోటవురట్ల మండలం

27న 4 ఎంపీపీ స్థానాలకు ఉప ఎన్నికలు

సాక్షి, అనకాపల్లి: ఈనెల 27వ తేదీన జిల్లాలో **నాలుగు చోట్ల మండల పరిషత్** అధ్యక్ష పదవికి **(ఎంపీపీ) ఉప ఎన్నిక జరగనుంది.** ఉమ్మడి విశాఖ **జిల్లాలో 5 ఎంపీపీ, 2 వైస్ ఎంపీపీ,** ఒక కో ఆప్షన్ **సభ్యుడి స్థానాలు ఖాళీగా ఉన్నాయి.** వీటిలో అనకా**పల్లి జిల్లాలో 4 ఎంపీపీ, రెండు వైస్** ఎంపీపీ, ఒక **కోఆప్షన్ సభ్యుడి స్థానాలకు ఎన్నిక** జరగనుంది. **ఎస్.రాయవరం, దేవరాపల్లి, మాకవరపాలెం, వి.మాడుగుల మండలాల్లో ఎంపీపీ** పదవికి, సబ్బ**వరం, చోడవరంలో వైస్ ఎంపీపీ** పదవికి, పెం**దుర్తిలో కో ఆప్షన్ సభ్యుడి స్థానా**నికి ఎన్నిక జర**గనుంది. అల్లూరి జిల్లాలో జి.మాడు**గుల ఎంపీపీకి **ఎన్నికల జరగనుంది. ఉప ఎన్నికల** గురించి ఎంపీ, **ఎమ్మెల్యే, ఎంపీటీసీలకు, కో ఆప్షన్** సభ్యులకు **నోటీస్ ద్వారా సమాచారం అందిం**చామని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 27న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట లోపు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉప సంహరణ ప్రక్రియ జరుగుతుందని.. అనంతరం ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించి, వెంటనే ఫలితాన్ని ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

- గతేడాది జనవరి 22న వి.మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు.
- గతేడాది ఏప్రిల్ 15న దేవరాపల్లిలో పులపర్తి రాజేశ్వరి, ఈ ఏడాది ఎస్.రాయవరంలో కోన లోవ లక్ష్మి ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు.
- గతేడాది జూలై 31న ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల పదవీ కాలం ముగియడంతో ఎంపీపీ పదవి నుంచి రుత్తల సత్యనారాయణ స్వచ్ఛందంగా తప్పుకున్నారు.

రెల్లీల వాటా పెంచాలి



ధర్నా చేస్తున్న రెల్లి కులస్తులు

- నర్సీపట్నంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా

నర్సీపట్నం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రెల్లి కులస్తులు శనివారం నర్సీపట్నంలో ధర్నా నిర్వహించారు. అబిద్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ర్యాలీగా బయలుదేరారు. ఒక శాతం వద్దు.. 5 శాతం ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. కార్యాలయ ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు, గౌరవ అధ్యక్షుడు బంగారి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు యర్రంశెట్టి అప్పన్నబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తీర్పుపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు తీరని అన్యాయం చేసిన కమిషన్ క్షేత్రస్థాయిలో పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఎ, బి, సి, డి వర్గీకరణలో రెల్లి కులస్తులకు 1 శాతం కేటాయించారని, ఇది ఎంతమాత్రం చాలదన్నారు. ఒకటి నుంచి ఐదు శాతం పెంచాలని డిమాండ్ చేశారు. రెల్లి కులస్తులు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు అన్ని రంగాల్లో వెనుకబడే ఉన్నారన్నారు. రెల్లీలు రిజర్వేషన్ ఫలాలకు దూరమై అన్యాయానికి గురవుతున్నారన్నారు. రిజర్వేషన్ వర్గీకరణపై పునరాలోచన చేయాలన్నారు. ధర్నాలో రెల్లి సంఘం నాయకులు ఇల్లపు లోవరాజు, బంగారి సూరిబాబు, చెన్నా శ్రీనివాసరావు, మంగళగిరి భగీరథరావు, మంగళగిరి భాస్కరరావు, మజ్జి దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ అధికారుల దౌర్జన్యం

- పరిహారం ఇవ్వకుండా రోడ్డు పనులు
- డి.ఎల్.పురంలో అడ్డగించిన రైతులు
- పోలీసుల మోహరింపు.. రైతులతో వాగ్వాదం



అఖిలపక్ష నాయికులతో చర్చిస్తున్న సీఐ కుమారస్వామి



రోడ్డు పనులు అడ్డుకుంటున్న రైతులు, అఖిలపక్ష నాయకులు

నక్కపల్లి: డీ ఫారం రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా ఏపీఐఐసీ అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించి రైతుల భూముల్లో రోడ్డు పనులు ప్రారంభించడాన్ని అఖిలపక్ష నాయకులు శనివారం అడ్డుకున్నారు. డి.ఎల్.పురంలో పోలీసులకు.. రైతులకు, అఖిలపక్ష నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలంటూ రైతులు యంత్రాలకు అడ్డంగా నిలబడి పనులు అడ్డుకున్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, స్థానిక సర్పంచ్ కిల్లాడ కృష్ణ తదితరులు మాట్లాడుతూ డి.ఎల్.పురంలో సర్వే నెంబరు 193, 194, 195, 196, 197, 198, 199లలో సుమారు 64 ఎకరాల ప్రభుత్వ భూమిని 1967లో గ్రామానికి చెందిన పేదలకు డీ ఫారం పట్టాలుగా మంజూరు చేశారన్నారు. అప్పటి నుంచి రైతులంతా మధ్య భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. ఇటీవల ఇండస్ట్రియల్ కారిడార్ కోసం, బల్క్‌డ్రగ్ పార్క్ కోసం భూములు సేకరించిన ప్రభుత్వం జిరాయితీ రైతులకు నష్టపరిహారం చెల్లించి డీ ఫారం రైతులకు ఇవ్వలేదన్నారు. తాజాగా ఏపీఐఐసీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు రైతులకు తెలియకుండా డీ ఫారం భూముల్లో బుల్‌డోజర్లు, జేసీబీల సాయంతో అక్రమంగా ప్రవేశించి చదును చేసి రోడ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. అడ్డుకున్న రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. విషయం తెలిసి తాము ఇక్కడకు వచ్చి రైతుల పక్షాన ప్రశ్నిస్తే తమపై కూడా దౌర్జన్యం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని రైతులకు చెందిన భూములను బలవంతంగా లాక్కోవడమే కాకుండా నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డు పనులు ప్రారంభించడం తగదన్నారు.

ఇరు పక్షాల వాదోపవాదాలు

ఈ సందర్భంగా పోలీసులకు, అఖిలపక్ష నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. నష్టపరిహారం చెల్లించేవరకు పనులు ప్రారంభించడానికి వీల్లేదని అఖిలపక్ష నాయకులు పట్టుబట్టారు. ఎస్ఐ కుమారస్వామి పనులు జరిగే ప్రాంతానికి వచ్చి రైతులు, ఆందోళనకారులతో చర్చలు జరిపారు. పరిహారం కోసం అధికారులను కలవాలని, అంతే తప్ప పనులు అడ్డుకోవడం తగదని సూచించారు. రైతులు బదులిస్తూ పనులు అడ్డుకోకపోతే నష్టపరిహారం చెల్లించే అవకాశం లేదని వివరించారు. 2013 భూసేకరణ చట్టానికి ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. నోటిఫికేషన్ సమయంలో ఒకలా భూసేకరణ సమయంలో మరోలా వ్యవహరించి రైతులను మోసం చేసిందని అప్పలరాజు ఆరోపించారు. తక్షణమే డీ ఫారం భూములు కలిగిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, కాని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

రసాయన పరిశ్రమలకు భూములిచ్చే ప్రసక్తి లేదు

- ఏపీఐఐసీ అధికారులకు స్పష్టం చేసిన రైతులు



సమావేశానికి హాజరైన రైతులు

నక్కపల్లి: తరతరాల నుంచి సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న భూములను రసాయన పరిశ్రమలకు ఇచ్చి ఆరోగ్యాలు పాడు చేసుకునే ప్రసక్తి లేదని పలువురు రైతులు ఏపీఐఐసీ అధికారులకు స్పష్టం చేశారు. శనివారం బల్క్‌డ్రగ్ పార్క్ కోసం అదనంగా భూములు సేకరించేందుకు ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు జానకయ్యపేట, సిహెచ్‌ఎల్ పురం తదితర గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ ఎస్‌డీసీ అనిత, తహసీల్దార్ నర్సింహమూర్తి మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్క్ కోసం బీడీపీ ఫేజ్ 2 కింద ఈ రెండు గ్రామాల్లో భూములు గుర్తించామని, రైతులు సహకరించాలని కోరారు. దీనిపై రైతులు మాట్లాడుతూ మామిడి, జీడి, కొబ్బరి తోటలు వేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న తమ భూములను ప్రమాదకర పరిశ్రమల కోసం సేకరించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే హెటిరో డ్రగ్స్ పరిశ్రమ వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారు ఆరోగ్యాలు పాడై ఆస్పత్రి పాలవుతున్నారన్నారు. తాజాగా ఈ ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నారని, తమ నుంచి భూములు తీసుకుని తమ ప్రాణాలకు ముప్పు తెచ్చే పనులు చేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నించారు. దీనిపై ఎస్‌డీసీ అనిత మాట్లాడుతూ సమావేశంలో రైతులు తెలిపిన విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతుల అంగీకారంతోనే భూములు తీసుకుంటామని, ఆమోదకరమైన నష్టపరిహారం, ప్యాకేజీ ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రైతు నాయకులు కురందాసు నూకరాజు, కురందాసు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వాసికి బిల్ గేట్స్ ప్రశంసలు

అక్కిరెడ్డిపాలెం: అప్పుడే పుట్టిన శిశువుల్లో వచ్చే పచ్చకామెర్ల నివారణకు వినియోగించే ఎనలైట్–360 పరికరాన్ని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ పరిశీలించారు. అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఎం.సుబ్రహ్మణ్యప్రసాద్ ఈ పరికరాన్ని తయారు చేశారు. దీనిని దేశ రాజధానిలో జరిగిన కార్యక్రమంలో ప్రదర్శించగా.. బిల్‌గేట్స్ ఎంతో ఆసక్తిగా పరిశీలించారు. పరికరం తయారుచేసిన ప్రసాద్‌ను అభినందించారు. ఈ పరికరం తయారీతో నూతన ఆవిష్కరణలకు అందించే ప్రతిష్ఠాత్మక ఆరోహణ్ సోషల్ ఇన్నోవేషన్ అవార్డు 2023ను ప్రసాద్ ఇప్పటికే సాధించారు.



ఎనలైట్–360 పరికరాన్ని పరిశీలిస్తున్న బిల్‌గేట్స్

క్లుప్తంగా

'కనీస వేతనాలు చెల్లించండి'



నిరసన వ్యక్తం చేస్తున్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 లో పనిచేస్తున్న కెప్టెన్స్

అనకాపల్లి టౌన్: తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102లో పనిచేస్తున్న కెప్టెన్స్‌కి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాస రావు కోరారు. స్థానిక జిల్లా సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా రూ.7,870 వేతనానికే పనిచేస్తున్నారన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో గర్భిణులు, బాలింతలకు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా గమ్యస్థానాలకు చేర్చడం, అత్యంత నైపుణ్యం కలిగి ఉండాలని, తగిన విద్యార్హతలు ఉన్నా కనీస వేతనం లేకపోవడంతో దుర్భరమైన పరిస్థితుల్లో వారు జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అలాగే మార్చి 31వ తేదీతో కాంట్రాక్ట్ ముగిసిపోతున్న నేపథ్యంలో వీరికి రూ. 18,500 జీతాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని, బీమా, ఇతర అలవెన్స్ సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.కృష్ణ, డి.శ్రీనివాసరావు, ఎ.నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఏటిగైరంపేటలో కార్డన్ సెర్చ్



ఏటిగైరంపేట షాపుల వద్ద డాగ్‌తో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ రేవతమ్మ

గొలుగొండ : గంజాయి రవాణాపై సిబ్బంది గట్టి నిఘా ఉంచాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రామారావు సూచించారు. ఏటిగైరంపేటలో శనివారం నార్కోటిక్ డాగ్‌తో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి కార్డన్ సెర్చ్ చేపట్టారు.చెక్‌పోస్టు వద్ద సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి ఏయే మార్గాల్లో పోయే అవకాశం ఉందో తెలుసుకుని నిఘా ఉంచాలని కోరారు. ఇతర దారుల్లో తరలిపోతుంటే అక్కడ కూడా సిబ్బంది ని మోహరించాలని చెప్పారు. పాత గంజాయి నిందితులపై దృష్టి సారించాలన్నారు.

ఎన్ఆర్ఐ మహిళలు.. స్వగ్రామంలో సేవలు

- నిరుపేద బాలిక విద్యకు ప్రోత్సాహం
- స్ఫూర్తినిస్తున్న స్నేహితురాళ్లు



మాడుగుల బీసీ వసతి గృహం విద్యార్థినులకు కాటన్ ప్యాడ్స్ అందజేస్తున్న మహిళలు



మాడుగుల బీసీ బాలికల వసతి గృహంలో విదార్థినులు



సంస్థ వితరణగా అందిస్తున్న సామగ్రి

మాడుగుల : ఉన్న ఊరు... కన్నతల్లిని మరిచిపోకూడదని పెద్దలు చెప్పిన మాటలు మదిలో పెట్టుకుని తాము పుట్టిన గ్రామానికి సేవ చేయాలని తలచారు. ముగ్గురు మహిళా స్నేహితులు. విదేశాలకు వెళ్లిన ముగ్గురు ఎన్నారై మహిళలు తమ ఊరిపై మమకారంతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ఇక్కడి వసతి గృహాల్లో ఉండి చదువుతున్న బాలికలకు చేయూతనివ్వాలని నిశ్చయించుకున్నారు. గ్రామానికి చెందిన మహిళలు వాడపల్లి రత్న కుమారి, గడిమెల్ల రజని, అయ్యల బాల త్రిపుర సుందరి, జెర్రి వావణరెడ్డి ఉద్యోగ రీత్యా యుఎస్‌ఏలో ఉంటున్నారు. స్నేహితులైన వీరంతా కలిసి ప్రభుత్వ వసతి గృహాల్లో విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థినులకు నెలసరి సమయంలో వాడే కాటన్ పేడ్‌లతో పాటు ఇతర సామగ్రి ఉచితంగా అందజేస్తున్నారు. విశాఖకు చెందిన సంపూర్ణ సంస్థ ద్వారా నెలకు రూ.30 వేలు విలువ గల శానిటరీ కాటన్ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్నారు. మాజీ ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఆధ్వర్యంలో మాడుగుల బీసీ బాలికల వసతి గృహాన్ని దత్తత తీసుకుని వితరణ అందజేశారు. వారిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

స్వగ్రామానికి సేవలు అభినందనీయం



మాడుగుల గ్రామానికి చెందిన మహిళలు వృత్తి రీత్యా యుఎస్‌ఏ వెళ్లి అక్కడ స్థిరపడినా, స్వగ్రామంలో సేవ చేయాలని తపన పడడం ఆనందదాయకం. నిరుపేద విద్యార్థుల చదువుకు ప్రోత్సహించడం, వారికి అవసరమైన సామగ్రి సమకూర్చడం, విశాఖ సంపూర్ణ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టడం వారి మానవత్వానికి నిదర్శనం

– వేమవరపు రామధర్మజ, మాజీ ఎంపీపీ మాడుగుల

బాలికా విద్యను ప్రోత్సహించడమే లక్ష్యం



మేము పుట్టిన గ్రామానికి చేతనైనంత సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. నిరుపేద బాలికల విద్యను ప్రోత్సహించడానికి గ్రామంలో వసతి గృహాన్ని దత్తత తీసుకుని వారికి అవసరమైన దుస్తులు ఉచితంగా అందజేస్తున్నాం. నాతో పాటు మరో ఇద్దరు స్నేహితులం సంయుక్తంగా విశాఖ సంపూర్ణ సంస్థ ద్వారా నెలకు రూ. 30 వేలు విలువ గల పేడ్ కాటన్ దుస్తులు ప్రతి నెలా అందిస్తున్నాం. ఇతర పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు కూడా అవసరమైన సామగ్రి అందజేయనున్నాం. అలాగే గ్రామాభివృద్ధికి కూడా మా వంతు సాయం అందించడానికి కృషి చేస్తాం.

– రత్నకుమారి, ఎన్ఆర్ఐ

విద్యుత్ ఫిర్యాదులు పరిష్కారం కాకపోతే పరిహారం

- విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ సత్యనారాయణ

తుమ్మపాల: విద్యుత్ ఫిర్యాదులు కాలపరిమితి లోగా పరిష్కారం కాకపోతే వినియోగదారులకు విద్యుత్ శాఖ పరిహారం చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ఛైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ స్పష్టం చేశారు. గవరపాలంలో గల గౌరీ గ్రంథాలయంలో నెహ్రూ యువ కేంద్రం, వినియోగదారుల ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్, మండల వినియోగదారుల మండలి సహకారంతో 'విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ప్రయోజనాలు' అంశంపై శనివారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్తు సరఫరాలో ఎలాంటి సేవా లోపం ఉన్నా సీజీఆర్ఎఫ్‌కు వ్యక్తిగతంగా గానీ, వాట్సాప్ నంబర్ 94936 81912 ద్వారా గానీ, chrper@apeastern power.com ఈ మెయిల్ పోస్టు ద్వారా ఆన్‌లైన్‌లో గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. వినియోగదారులు సమస్య ఉత్పన్నమైన నాటి నుంచి రెండేళ్లలోపు నిర్దేశిత దరఖాస్తులో రాతపూర్వకంగా సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయవచ్చని, 60 రోజుల్లోపు తీర్పు వెలువడుతుందన్నారు. అయితే దీనికి ముందు 1912కు, క్షేత్ర స్థాయి విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసి తిరుగు రశీదులు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పలు సమస్యలపై విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదులు చేశారు. రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డెరైక్టర్ గొర్లి మహేశ్వరరావు, సీజీఆర్ఎఫ్ సభ్యులు షైక్ బాబర్, వి.మురళీకృష్ణ, సమాచార హక్కు ఉద్యమకర్తలు కె.శ్రీరామకిషోర్, ఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.వి.రామరెడ్డి, గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు వినియోగదారులు పాల్గొన్నారు.

కోటి 27లక్షలు పని దినాలు కల్పనకు ప్రణాళిక

- కూలీలకు రూ.350 కోట్లు, మెటీరియల్‌కు రూ.240 కోట్ల ప్రతిపాదనలు
- డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు పూర్ణిమాదేవి

నాతవరం : ఉపాధి హామీ పథకంలో 2025–26 సంవత్సరానికిగాను రూ.కోటి 27లక్షలు పని దినాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు పూర్ణిమాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో రూ.20.70 కోట్లు సోషల్ అడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించేందుకు రూ.350 కోట్లు బడ్జెట్‌కు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జిల్లాల్లో వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు మెటీరియల్ రూపంలో రూ.240 కోట్లకు ప్రణాళిక తయారు చేశామన్నారు. గత నవంబరులో పంచాయతీల వారీగా నిర్వహించిన గ్రామసభల ద్వారా వచ్చే ఏడాది పనులకు సంబంధించి ముందస్తు ప్రణాళిక రూపొందించామన్నారు. గత ఏడాది ఉపాధి హామీ కూలీలకు రూ.335 కోట్లు కూలీ డబ్బులు చెల్లింపులు చేశామన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు మెటీరియల్ రూపంలో రూ.214 కోట్లు ఖర్చు చేశామన్నారు. వచ్చే ఏడాది 640 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో గోకులం షెడ్లు అమృత్ సరోవర్ పథకంలో చెరువులు అభివృద్ధి ఫారం పాండ్‌లు, ఉద్యానవన తోటలు, పశుగ్రాసం పెంపకం వంటి పనులు చేస్తామన్నారు. జిల్లాలో 2లక్షల 8వేలకు పైగా జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. జాబ్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పనులకు 17వ విడత సామాజిక తనిఖీలు ప్రజా వేదిక ఈనెల 29 వ తేదీతో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలకుమారి ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఎంపీడీవో ఉషాశ్రీ తాండవ ప్రాజక్టు ఛైర్మన్ కె.సత్యనారాయణ వైస్ ఎంపీపీ పైల సునీల్ మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసిదేముడు పారుపల్లి కొండబాబు రాష్ట ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టరు కొంద్రు మరిడియ్య మండల టిడిపి అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ ఎపివో చిన్నారావు మండల వ్యాప్తంగా ఉన్న వీఆర్పీలు ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శరగడం లక్ష్మి ఎంపిక



ఎంపీటీసీ సమావేశంలో అభ్యర్థిని ప్రకటిస్తున్న సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్

చోడవరం : మండల పరిషత్ వైస్ ఎంపీపీ స్థానానికి వైఎస్సార్‌సీపీ నుంచి శరగడం లక్ష్మిని ఆ పార్టీ ఎంపిక చేసింది. చోడవరం మండల పరిషత్ వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. మండల పరిషత్‌లో 25 ఎంపీటీసీ స్థానాలకు గాను 20ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి ఉన్నాయి. ముందస్తు ఒప్పందం మేరకు గంగరాజు రాజీనామా చేయడంతో ఆస్థానానికి జరుగుతున్న ఎన్నిక లాంఛనంగా వైఎస్సార్‌సీపీకే దక్కుతుంది. దీంతో పార్టీ ఎంపీటీసీలతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చోడవరంలో పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. గవర సామాజిక వర్గానికి చెందిన గంగరాజు రాజీనామాతోఅదే సామాజిక వర్గానికి చెందిన అంబేరుపురం ఎంపీటీసీ సభ్యురాలు శరగడం లక్ష్మికి ఆ పదవి ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్టు సమన్వయకర్త అమర్‌నాథ్ ప్రకటించారు. ఈ సమావేశానికి 18మంది ఎంపీటీసీలు హాజరయ్యారు. వీరంతా పార్టీ నిర్ణయానికి ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈనెల 27న ఎన్నిక జరుగుతుండడంతో పార్టీ ఎంపీటీసీలంతా ఒకే తాటిపై ఉండి ఏకగ్రీవంగా లక్ష్మిని ఎన్నుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యువజన అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, రైతు అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమ్మతి తెలిపిన వారినే స్పాట్ వాల్యుయేషన్‌కు నియమించాలి



డీఈవోకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి టౌన్ : పదో తరగతి బోధించడంలో మూడేళ్ల కంటే ఎక్కువ అనుభవం కలిగిన ఉపాధ్యాయులనే పరీక్షల స్పాట్ వాల్యుయేషన్‌లో నియమించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. ఈ మేరకు డీఈవో గిడ్డి అప్పారావు నాయుడుకు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయ్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష మూల్యాంకానికి సమ్మతి తెలిపే వారినే ఎంపిక చేయాలన్నారు. అలాగే 58 సంవత్సరాల పైబడిన వయస్సు, దీర్ఘకాలిక వ్యాధులు కలవారు, 50 శాతం అంగవైకల్యం గల ఉపాధ్యాయులకు వారు కోరిన మేర మినహాయింపు ఇవ్వాలన్నారు. స్పాట్ వ్యాల్యూషన్‌కు ఆయా సబ్జెక్టులలో ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం అవుతారో ఆ సీనియార్టీ లిస్టులను ముందుగా తెలియజేయాలన్నారు. ఆయా సెంటర్లలో తగు వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్, మునగపాక యూటీఎఫ్ నాయకులు ఆశ, రవి, కరుణ, జ్యోతి పాల్గొన్నారు.

వంద కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు వ్యక్తుల అరెస్టు
- ఇద్దరు పరార్



గంజాయితో పట్టుబడిన నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

నర్సీపట్నం: ఆటోలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్టు చేశామని, మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టుబడిన గంజాయి, నిందితులను మీడియా ముందుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ట్రైనీ డీఎస్పీ చైతన్య, ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ సాంబశివ మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి బాలుర గురుకుల పాఠశాల మెయిన్ రోడ్డులో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. కె.డి.పేట నుంచి నర్సీపట్నం మీదగా తాళ్లపాలెం ఆటోలో గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆటో డ్రైవర్, నర్సీపట్నానికి చెందిన వ్యక్తి పరారయ్యారు. చింతపల్లి మండలం, కొరుకొండ గ్రామానికి చెందిన ఎం.గాంధీ, వంతుల హరిబాబు, నర్సీపట్నానికి చెందిన రౌడీషీటర్ భార్గవను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన వ్యక్తుల కోసం గాలిస్తున్నామన్నారు. ఆటోతో పాటు వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో టౌన్ సీఐ గోవిందరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

- క్లీనర్‌కు గాయాలు



మృతి చెందిన లారీ డ్రైవర్ షేక్ మస్తాన్ వల్లి

కశింకోట : నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలెం కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్ గాయపడ్డాడు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం.. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న లారీ డ్రైవర్ ఎటువంటి సిగ్నల్స్ ఇవ్వకుండా త్రిపురవానిపాలెం కూడలి వద్ద అవతలి రోడ్డుకు వెళ్లడానికి అకస్మాత్తుగా లారీని మలుపు తిప్పడంతో అదే మార్గంలో వస్తున్న మరో లారీ వెనుకగా ఢీ కొంది. దీంతో వెనుక లారీ డ్రైవర్ షేక్ మస్తాన్ వల్లి (62) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్ కూడా స్వల్పంగా గాయపడ్డాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

క్యాన్సర్‌పై పోరాటాన్ని వేగవంతం చేయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ రవిశంకర్

మహారాణిపేట (విశాఖ): క్యాన్సర్‌పై పోరాటాన్ని వేగవంతం చేసి.. అంతర్జాతీయ సహకారం, పరిశోధన, పురోగతికి బలమైన వేదికగా నిలబడాలని ఓమేగా క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బెల్లాల రవిశంకర్ ఆకాంక్షించారు. శనివారం విశాఖలోని ఓ హోటల్‌లో ఓమేగా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన మాలిక్యులర్ అంకాలజీ సొసైటీ కాన్ఫరెన్స్–2025ను ఆయన జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలిక్యులర్ అంకాలజీ సొసైటీ అనేది క్యాన్సర్ బయాలజీని లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. కొత్త క్యాన్సర్ చికిత్సా విధానాలను అభివృద్ధి చేయడానికి అంతర్జాతీయ సంస్థ పరిశోధకులు, వైద్యులు, ఆరోగ్య సంరక్షణ నిపుణుల మధ్య సహకారాన్ని అందిస్తుందన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ క్యాన్సర్ పరిశోధన, చికిత్సా విధానాల్లో నూతన ఆవిష్కరణలపై చర్చలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిల్పా, డాక్టర్ ఎస్.రామకోటీశ్వరరావు, డాక్టర్ బి.వి.మాధవి తదితరులు పాల్గొన్నారు. ఆదివారం కూడా ఈ సదస్సు జరుగుతుంది. ఈ సదస్సులో 100 మందికి పైగా ప్రముఖులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత మాలిక్యులర్ అంకాలజీ నిపుణులు, వైద్యులు, పరిశోధకులు పాల్గొంటున్నారు. 'ప్రెసిషన్ మెడిసిన్ ద్వారా క్యాన్సర్ సంరక్షణలో విప్లవాత్మక మార్పులు' అనే ప్రధాన థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రశ్నించే గొంతులపై దాడులను ఖండించాలి



డీఎస్పీ శ్రీనివాసరావును కలిసిన ప్రజా సంఘాల, రాజకీయ నాయకులు

నర్సీపట్నం : సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజుపై జరిగిన దాడిపై ఎంపీ సీఎం రమేష్ స్పందించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. కోన గురవయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఇలాంటి చర్యలు చాలా సిగ్గుచేటన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బొట్టా నాగరాజు మాట్లాడుతూ ప్రశాంతమైన నర్సీపట్నంలో ఇలాంటి దాడులకు పాల్పడడం ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎర్రంశెట్టి పాపారావు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులపై జరుగుతున్న ఇలాంటి దాడులు ఖండించకపోతే ఇదే సంస్కృతి కొనసాగుతుందన్నారు. బాధితుడు శివనారాయణరాజుకు అండగా ఉంటామన్నారు. బీజేపీ నాయకుడు వెలగ జగనాథం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దాడులు దురదృష్టకరమన్నారు. టాక్స్ పెయిర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ దాడులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమన్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు.

టీడీఆర్ బాండ్లు మాకొద్దంటూ ఆందోళన



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న నిర్వాసితులు

మునగపాక : పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి పరిహారంగా నగదు అందించాలని, అంతే కాని టీడీఆర్ బాండ్లు తమ కొద్దంటూ శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేపట్టారు. గ్రామసభలు నిర్వహించి ప్రతి బాధితునికి తమ అకౌంట్‌లో పరిహారం జమ అవుతుందని చెప్పి నేడు టీడీఆర్ బాండ్లు ఇస్తామంటూ చెప్పడం తగదన్నారు. సీఐటీయూ నేత బ్రహ్మాజీ మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణలో ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోతున్న వారికి చట్ట ప్రకారం పరిహారం అందిస్తామని అధికారులు చెప్పారన్నారు. అభివృద్ధికి తాము అడ్డంకి కాదని, ప్రభుత్వ పరిహారం మాత్రం నగదు రూపంలో అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుకు వినతి అందజేశారు.

కత్తితో దాడికి పాల్పడ్డ నూకరాజు అరెస్టు

మునగపాక : మండలంలోని గొల్లలపాలెంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు పక్కుర్తి నూకరాజును శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. వివరాలివి. గొల్లలపాలెంలో ఈనెల 20వ తేదీన ఇద్దరి మధ్య జరిగిన గొడవలో శీర చిన్నారావు తలపై అదే గ్రామానికి చెందిన పక్కుర్తి నూకరాజు కత్తితో దాడి చేసి పరారైన సంగతి తెలిసిందే. ఈమేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు నూకరాజు కోసం గాలించారు. శనివారం అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ప్రతి కార్యకర్తకు భరత్‌కుమార్ అండ



సత్యవతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల రమేష్

తుమ్మపాల: పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల రమేష్ తెలిపారు. పట్టణంలో 83వ వార్డు వైఎస్సార్‌సీపీ గృహ సారధి తురకలపూడి సరోని తల్లి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబానికి రూ.5 వేల సాయం చేశారు. భరత్ సూచనల మేరకు శనివారం తురకలపూడి సరోని తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు బండి ఆనంద్, కటారి నూకరాజు, నడుపూరి శ్రీనివాసరావు, నడిశెట్టి గోవింద, తంగెళ్ల రామకృష్ణ(బుజ్జి), రెడ్డి చిన్న, కటారి శ్రీనివాసరావు, నిమ్మకాయల మాదవ్, సోమ శేఖర, రెడ్డి చంటి పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అనకాపల్లి టౌన్: సకాలంలో అందించిన చికిత్స ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా శనివారం తుమ్మపాల వీధుల్లో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు చిన్న పిల్లలకు బీసీజీ టీకాలు వేయించాలన్నారు. డీవోటీఎస్ చికిత్సతో వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరం నేడు

అనకాపల్లి టౌన్: భారత్ వికాస పరిషత్ నోబుల్ చారిటీస్ ఆధ్వర్యంలో ఆదివారం తొమ్మిది గంటలకు ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భారత్ వికాస పరిషత్ అధ్యక్షురాలు ఎస్ విజయలక్ష్మి తెలిపారు. గవరపాలెం సాయి బృందావన్‌నగర్ కృష్ణ సాయి ఆలయం వద్ద నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పక్షులకు సేవా కార్యక్రమం నేడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని దేవాలయాల ఆవరణలో ఆదివారం పక్షులకు వరి కంకులు, తాగునీరు ఉండే మట్టి పాత్రలు, గూళ్ల ఏర్పాటు చేయు కార్యక్రమం నిర్వహించనున్నట్టు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి ప్రేమికులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 5,650 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
స్పెషల్ రకం	3,770	4,230
మొదటి రకం	3,660	4,030
రెండో రకం	3,120	3,790
మూడో రకం	2,930	3,110

అనకాపల్లి సినిమాలు

రాజా :	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-1:	టుక్‌టుక్
సత్యనారాయణ స్క్రీన్-2:	యుగానికి ఒక్కడు
పర్తిసాయి	: కోర్ట్
షిర్డీసాయి	: పెళ్లికాని ప్రసాద్
వెంకటేశ్వర(ఉదయం)	: షణ్ముక
వెంకటేశ్వర(మ్యాట్నీ, 1,2 షోలు):	న్యూ పోలీస్ స్టోరీ
శ్రీసత్య	: సలార్
రామచంద్ర	: ఛావా

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-05 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

26న మెగా జాబ్ మేళా

నర్సీపట్నం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ వారి సౌజన్యంతో నర్సీపట్నం రిషీ కాలేజీలో ఈ నెల 26న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ కె.సతీష్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో 18 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూటమి కక్ష.. పేదలకు శిక్ష

జగనన్న కాలనీలో కనీస వసతులు కరువు

కనీసం రోడ్లు, వీధి లైట్లు, తాగునీరు లేక అవస్థలు

ఆందోళనకు దిగిన లబ్ధిదారులు

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తుండటంతో జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారులు కనీస వసతులకు నోచుకోవడం లేదు. ప్రధానంగా మండలంలోని సంపతిపురం పంచాయతీ పరిధి జగనన్న కాలనీలో రోడ్లు, మంచి నీరు, విద్యుత్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి ఊర్లకు ఊర్లే నిర్మించింది. లబ్ధిదారులు ప్రభుత్వ సహాయంతో పాటు కొంత మేర అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కాలనీలను అభివృద్ధి చేయడం మానేసింది. దీంతో అక్కడ



పునాదుల స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లు



ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తూరు, శారదానగర్‌లలో అద్దెకు నివాసముంటున్న 255 మంది లబ్ధిదారులకు సమీపంలోని సంపతిపురం పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీలో స్థలాలు ఇచ్చారు. మొదట్లో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. రెండు మంచినీటి బోర్లను, గ్రావెల్‌తో రోడ్లను నిర్మించారు. దీంతో ఉన్న కొద్ది పాటి వసతులతో 70 మంది వరకు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆనక గృహ ప్రవేశాలు చేసుకుని అరకొర వసతులతో ఇబ్బందులు



కనీసం రోడ్డు సౌకర్యం లేని జగనన్న కాలనీ

పడుతున్నారు. వంద మంది ఇళ్లకు పునాదులు తీసి వదిలేశారు. 40 మంది లక్షలాది రూపాయలు వెచ్చించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి తాళాలు వేసుకొని వేరే చోట అద్దెకు ఉంటున్నారు.

లబ్ధిదారుల ఆందోళన

కొత్తూరు పంచాయతీ ప్రజలకు సంపతిపురంలో ఇళ్లు ఇవ్వడంతో రెండు పంచాయతీ అధికారులు వీరిని పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వంలో ప్రతీ స్తంభానికి వీధి లైట్లు అమర్చినా వాటికి వెలిగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చీకటి పడితే ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా పాములు తిరుగుతున్నాయి. అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నా, ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నామని లబ్ధిదారులు శనివారం ఆందోళన చేపట్టారు.



ఇంటి నిర్మాణం పూర్తయినా తాళాలు వేసి వదిలేసిన ఇళ్లు

సుదూరం నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నాం



గత వైఎస్సార్‌సీపీ హయాంలో స్థలాలు ఇచ్చి ప్రభుత్వం సహాయం చేయడంతో ఇళ్లు నిర్మించుకున్నాం. కొంత మేర సౌకర్యాలు కల్పించింది. ఇప్పటి కూటమి ప్రభుత్వం కాలనీలో సౌకర్యాలు కల్పించడం మానేసింది. మంచినీరు కూడా సుదూర ప్రాంతం నుంచి తెచ్చుకుంటున్నాం.

– వసుంధర, సంపతిపురం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం.



కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. అయినా మమ్ములను పట్టించుకోవడం మానేశారు. రాత్రిళ్లు పాములు తిరుగుతున్నాయి. తక్షణమే మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలి.

– చెక్కా రాము, సంపతిపురం

భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ ఆదర్శనీయం

తుమ్మపాల: ప్రతి యువకుడు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకుని సమాజం కోసం పాడుపడాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎం.నూకరాజు కోరారు. పట్టణంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువకులు చెడు వ్యసనాలకు లోనై, సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్నారని వాపోయారు. వీటికి దూరంగా ఉండాలని, భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం కోసం పోరాడి 23 ఏళ్ల వయస్సులోనే ఉరి కంభాన్నీ సైతం ముద్దాడి ప్రాణాలను వదిలారన్నారు. సమాజంలో విద్యార్థినులు, మహిళలపై అనేక దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం నేటికీ కఠిన చర్యలు తీసుకోలేని విధంగా ఉన్నాయన్నారు. మాదక



పట్టణంలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ

ద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వాలు విఫలమవ్వడంతోనే యువత బానిసలై మత్తులో అనేక దారుణాలకు పాల్పడుతున్నాయన్నారు. సమాజంలో మార్పులు రావాలంటే విద్యార్థులకు, యువకులకు చరిత్ర తెలియజేయాలన్నారు. విద్యార్థి యువకుల్లో దేశభక్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీహరికోటను సందర్శించిన అనకాపల్లి విద్యార్థులు

అనకాపల్లి టౌన్: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్(ఇస్రో) సెంటర్‌ను దాడి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సందర్శించారు. రాకెట్ లాంచ్ ప్యాడ్లు, కంట్రోల్ రూమ్ కార్యకలాపాలు, ఉపగ్రహ ప్రక్షేపణ విధానాలు వంటి కీలక అంశాలపై ప్రత్యక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని తిలకించారు. ఈ సందర్భంలో ఇస్రో శాస్త్రవేత్త రామాంజనేయులు మార్గదర్శకత్వంలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఉపగ్రహ ప్రక్షేపణాల తీరుతెన్నులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతరిక్ష సాంకేతికపై విజ్ఞానాన్ని పెంపొందించుకొని భవిష్యత్‌లో స్పేస్ టెక్నాలజీ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు అత్యాధునిక సాంకేతికను అర్థం చేసుకోవడానికి ఇలాంటి సందర్శనలు ఎంతగానో



శ్రీహరికోటలోని రాకెట్ లాంచ్ ప్యాడ్లను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఇస్రో సాటిలేని ఘనతను అందుకుని పరిశోధన, ప్రయోగాలలో నూతన ఒరవడిని నెలకొల్పిందన్నారు.

మండల సమావేశంలో భూసమస్యలపై ధ్వజం

నర్సీపట్నం : మండల పరిషత్ సమావేశంలో భూసమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాము ముగ్గురు అన్నదమ్ములం..మాకు ఉన్న భూమిని ముగ్గురికీ కాకుండా రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది ఆరుగురికి పంపిణీ చేశారని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు డీటీని ప్రశ్నించారు. తమకు సంబంధం లేని ముగ్గురు వ్యక్తులకు మా భూమిని ఎలా పంచుతారని నిలదీశారు. అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీ సుకల రమణమ్మ రెవెన్యూ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. తనకు సంబంధించిన 82 సెంట్ల జిరాయితీ భూమి రీసర్వే చేసిన తర్వాత 69 సెంట్లు చూపిస్తుందని, మిగిలిన భూమి ఏమైందని డీటీ నరేంద్రను వివరణ కోరారు. జిరాయితీ భూములను ఈనాం భూములుగా చూపించడం వల్ల రైతులు తీవ్ర



భూసమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్న సర్పంచ్ కన్నయ్యనాయుడు

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ విషయాలను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి పొరపాట్లు జరగకుండా చూస్తానని డీటీ నరేంద్ర బదులిచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే జీలుగ, జనుము విత్తనాలు రప్పించాలని ఎంపీటీసీ రాంప్రసాద్ ఏవో అప్పారావుకు సూచించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీలు తాతబాబు, ఇన్నం రత్నం, ఎంపీడీవో ఉషాశ్రీ, సూపరింటెండెంట్ రమణబాబు పాల్గొన్నారు.

31 వరకు గాలికుంటు టీకాల కార్యక్రమం

కె.కోటపాడు : గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు 3 నెలలు దాటిన ఆవులు, గేదెలకు పాడి రైతులు తప్పక టీకాలు వేయించాలని కొరువాడ పశు వైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అన్నారు. కొరువాడ, డి.అగ్రహారం, గవరపాలెం గ్రామాల్లో పశు వైద్య సహాయకులు శనివారం నిర్వహిస్తున్న గాలికుంటు టీకాలను వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరువాడ పశు వైద్య కేంద్రం పరిధిలో గల గ్రామాల్లో 5500 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయాలని లక్ష్యం పెట్టుకోగా ప్రస్తుతానికి 4200 పశువులకు వేసినట్టు తెలిపారు. ఈ నెలాఖరువరకూ టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.



ఆవులకు గాలికుంటు టీకాలను వేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

టీకాలను ఆరు నెలలు దాడిన చూడి పశువులకు వేయరాదని ఆయన సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు లింగేశ్వరరావు, దేముడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

చోడవరం : ప్రకృతి వ్యవసాయంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం అధికారి సిహెచ్.లచ్చన్న సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారు చేసే అంశంపై సంబంధించి వ్యవసాయాధికారులు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో రైతుల వివరాలను, వేసే పంటలు, ప్రస్తుతం సాగులో ఉన్న పంటల పరిస్థితిపై ఈ సందర్భంగా సమీక్షించారు. నవధాన్యాలు పండించే విధానంలో 30 రకాల విత్తనాలు ప్రకృతి వ్యవసాయంలో



సిబ్బందికి సూచనలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి లచ్చన్న

సాగు చేసేందుకు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయశాఖ సహాయక సంచాలకుడు రవీంద్రనాథ్, వెలుగు ఏపీఎం తిలక్, గోవింద పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబు మోసం

అనకాపల్లి టౌన్: జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు రాష్ట్ర స్థాయిలో చేయడానికి నిర్ణయించడం దళితులను మోసం చెయ్యడమేనని దళిత సంఘాల జిల్లా జేఏసీ కో-కన్వీనర్ సాల్మన్ రాజు విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులు సామాజిక ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని, వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు కేటాయించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ ప్రతినిధులు గొంది అప్పారావు, మెరుగు శేఖర్, చిరంజీవి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు జీవీఎంసీ సహకారం

కమిషనర్‌ను కోరిన ఆలయ ఈవో



విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఈవో రాంబాబు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నూకాంబిక అమ్మవారి పండుగను రాష్ట్ర పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జీవీఎంసీ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆలయ ఈవో వెంపల రాంబాబు కోరారు. విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్‌ను శనివారం ఆయన కలిశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

స్వయంభూవరం గ్రామాన్ని తరలించండి




మూల స్వయంభూవరం మహిళల సమస్యలను తెలుసుకుంటున్న కోటేశ్వరరావు

పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకున్న కలపాక శివారు మూల స్వయంభూవరం గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి ప్రజలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్వయంభూవరం గ్రామానికి శనివారం సందర్శించిన కోటేశ్వరరావు స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూలస్వయంభూవరం గ్రామం అత్యంత కాలుష్య కారక గ్రామంగా మారిపోయిందన్నారు. ఎన్టీపీసీ కాలుష్యంతో కిడ్నీ, కంటి, ఊపిరితిత్తులు, గుండె, క్యాన్సర్, చర్మ వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'వీఆర్పీపై తప్పుడు ఫిర్యాదులు తగవు'

నాతవరం : తప్పుడు ఫిర్యాదుతో ఫీల్డ్ అసిస్టెంటు (వీఆర్పీని) ఇబ్బంది పెట్టే విధంగా కూటమి నేతలు ప్రయత్నించడం సరి కాదని, వాస్తవాలు పరిశీలించాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి దృష్టికి వైస్ ఎంపీపీ పైల సునీల్ సర్పంచ్ బోడ్డు సత్యనారాయణ తీసుకెళ్లారు. గన్నవరం పంచాయతీలో సామాజిక తనిఖీలు చేసే బృందం వచ్చినప్పుడు కొందరు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. ఆరుగురు పేర్లు తప్పుడు మస్తర్లు వేసినట్టుగా కావాలని వీఆర్పీపై ఫిర్యాదు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో సక్రమంగా పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ముందు ఆరుగురికి తప్పుడు మస్తర్లుగా వేశారని ఫిర్యాదు చేసి, సభలో ఇద్దరే అంటూ చూపించారని అన్నారు. ఇద్దరిలో ఒకరు సభ వద్దకు వచ్చి తాను ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లానని చెప్పారని, దీని బట్టే తప్పుడు ఫిర్యాదులని స్పష్టమవుతుందని వాస్తవాలు పరిశీలించాలని అన్నారు. దీంతో సభలో కూటమి నేతలు, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌ల నడుమ వాదులాట జరిగింది. పీడీ కలుగజేసుకుని వాస్తవాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.



వీఆర్పీపై తప్పుడు ఫిర్యాదుపై డ్వామా పీడీ దృష్టికి తీసుకెళ్లిన వైస్ ఎంపీపీ సునీల్

పంచాయతీల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ



తాళ్లపాలెంలో పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సుభాషిణి



గొబ్బూరు సంపద కేంద్రంలో ఎరువుల తయారీ పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సుభాషిణి

కశింకోట: పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచడానికి కార్యదర్శులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గొబ్బూరులో సంపద కేంద్రాన్ని సందర్శించారు. దాని నిర్వహణ తీరును పరిశీలించారు. చెత్తను సంపద కేంద్రానికి తరలించి ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తడిపొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. తద్వారా పరిశుభ్రత గ్రామాలకు సహకరించాలని కోరారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎన్. సత్యారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సివిల్ వివాదాలను పరిష్కరించుకోవాలి

కశింకోట: సివిల్ వివాదాలను పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోటలో ఓ రైతు భూ సమస్యను సమావేశం దృష్టికి తెచ్చారు. దీన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, ఎస్ఐ లక్ష్మణరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న మండల ప్రత్యేక అధికారి సుభాషిణి

శిక్షణలో నేర్చుకున్నవి అమలు చేయండి

కశింకోట: అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను తమ పరిధిలో ఆచరణలో అమలు చేయడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి కోరారు. మండలంలోని బయ్యవరంలో మూడు రోజులపాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన 'పోషణ భీ-పడాయి భీ' శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారంతోపాటు ఆట పాటల ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్యను అందివ్వాలన్నారు. వివిధ లోపాలున్న పిల్లలను గుర్తించి వారికి ఏ విధమైన సంరక్షణ అందించాలో తెలియజేయాలన్నారు. అసిస్టెంట్ సీడీపీవో టి. శశికళ, సూపర్‌వైజర్లు ఎం.ఝాన్సీ, సిహెచ్. వంశీప్రియ, జి.కె.లక్ష్మి, జి. వెంకటలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో ప్రభావతి

పంట నిల్వకు యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెందుర్తి: ఆరుగాలం శ్రమించి పండించిన పంట నిల్వకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని కేంద్ర గిడ్డంగుల సంస్థ జిల్లా యూనిట్-1 మేనేజర్ పి.శ్యాం సుందర్‌బాబు సూచించారు. స్థానిక మహిళా ప్రగతి కేంద్రంలో 'కృషి సంవర్ధన్' కార్యక్రమంలో భాగంగా శాస్త్రీయ పద్ధతిలో ధాన్యం నిల్వ చేసుకునే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులతో సేద్యం చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకుంటే రైతులకు వ్యయభారం తగ్గుతుందన్నారు. పంట నిల్వకు ప్రభుత్వ గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు గిడ్డంగుల సంస్థ నుంచి అందుతున్న రుణ సదుపాయాల గురించి వివరించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఒక్కో రైతుకు 1.5 క్వింటా మెటల్ బిన్‌లు, ఒక కిలో రాగి విత్తనాలు ఉచితంగా అందించారు. మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ ప్రతినిధులు ద్రవిన్ గొట్టపు, మజ్జి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌బాబు